‘బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కనుమరుగవడం ఖాయం’


బీబీ పాటీల్‌ను సన్మానిస్తున్న విజయ్ యాదవ్ తదితరులు

అబిడ్స్: ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కనుమరుగవడం ఖాయమని గోల్కొండ జిల్లా బీజేపీ జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి విజయ్‌యాదవ్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన ఎంపీ బీబీపాటీల్‌ను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌యాదవ్ మాట్లాడుతూ.. జహీరాబాద్, హైదరాబాద్‌తో పాటు అన్ని ప్రాంతాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలను చిత్తుగా ఓడించి బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. అన్నివర్గాల ప్రజలు మోదీ పథకాలకు ఆకర్షితులై బీజేపీవైపు మొగ్గుచూపుతున్నారన్నారు. బీబీపాటీల్ రాకతో బీజేపీకి మరింత బలం చేకూరిందని విజయ్‌యాదవ్ పేర్కొన్నారు.

కళలతో మానసిక వికాసం


ప్రదర్శనను తిలకిస్తున్న వీసీ ప్రొ.కవిత దరియాని రావు, రిజిస్ట్రార్ సుందర్‌కుమార్

విజయనగర్‌కాలనీ: మానసిక వికాసాన్ని కలిగించే శక్తి కళలకు ఉందని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత దరియాని రావు, రిజిస్ట్రార్ కొడాలి సుందర్ కుమార్ అన్నారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆర్ట్ గ్యాలరీలో అప్లయిడ్ ఆర్ట్స్ విభాగం ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనను సోమవారం వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ..లైంగిక వేధింపులు, మహిళలపై జరుగుతున్న అకృత్యాలను ఏర్పాటు చేసిన కళారూపాలు ఆలోచింపచేస్తున్నాయన్నారు. లింగ వివక్షతతో చిన్నపిల్లలను సైతం లైంగికంగా వేధిస్తున్న సంఘటనల నేపథ్యంలో ధైర్యం అనే ఆయుధంతో ముందుకు సాగాలని చెబుతున్న చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. కార్యక్రమంలో సీఎఫ్ఏ ప్రిన్సిపాల్ టి.గంగాధర్ అప్లయిడ్ ఆర్ట్స్ విభాగాధిపతి, ఎంఎల్ ఆనంద్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.హరీష్‌బాబులతో పాటు యూనివర్సిటీ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే


పట్టాలు అందజేస్తున్న స్కూల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ సంగమేశ్వర గుప్తా

జియాగూడ: ఆటపాటలతో మూడేళ్ల పాటు విద్యను పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేస్తున్నామని శ్రీ శ్లోకా ది స్కూల్ చైర్మన్ బిట్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ సంగమేశ్వరగుప్తా అన్నారు. సోమవారం జియాగూడ శాంతినగర్‌లోని స్కూల్‌లో ప్రీ ప్రైమరీ పూర్తిచేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేట్ పట్టాలను బహూకరించే కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతిప్రజల్వన చేశారు. అనంతరం సుమారు 241 మంది విద్యార్థులకు పట్టాలను అందజేశారు. చివరగా స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఎం.నాగేశ్వర్ మాట్లాడుతూ..ప్రతి యేటా చిన్నారి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేసి ప్రోత్సాహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్‌లు ఎస్.రత్నేష్‌గౌడ్, ఎం.తిరుమల్ రావు, బి.అన్వేష్, వైస్ ప్రిన్సిపాల్ అమితాచరణ్, జి.జయ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



చిన్నారికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్ మంతటి

జియాగూడ: చిన్నారులకు సకాలంలో పరీక్షలు నిర్వహించి జాగ్రతలు తీసుకున్నట్లయితే భవిష్యత్‌లో ఎలాంటి వ్యాధులు దరిచేరవని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్స్ చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ వినయ్ కుమార్ మంతటి అన్నారు. సోమవారం జియాగూడ శ్రీ శ్లోకా ది స్కూల్‌లో రిషిత్ డయగ్నొస్టిక్, పాలి క్లినిక్, కిమ్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన వైద్య శిబిరంలో పలువురి విద్యార్థులకు వైద్య చికిత్సలు నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్, డైరెక్టర్ నాగేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ అమిత చరణ్, జయ పాల్గొన్నారు.

వీనస్ హైస్కూల్‌లో రోబోటిక్ ఫెయిర్

గోల్కొండ: రోబోటిక్ పోటీలు విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని వీనస్ విద్యా సంస్థల చైర్మన్ మహ్మద్ హిదాయత్ ఆలీ ఖాన్ అన్నారు. సోమవారం టోలిచౌకీ డిలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్‌లో రోబోటిక్ ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా 6–10వ తరగతి విద్యార్థులు ఆలోచింపజేసే రోబోటిక్ నమూనాలను తయారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు సైన్స్‌తో పాటు నేటి కాలంలో ఎంతగానో ఉపయోగపడుతున్న రోబోటిక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాలపై విద్యార్థులకు బోధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సయ్యద్ సోహెల్, సయ్యద్ ఆరీఫ్, షెబాజ్ అహ్మద్ తదితరులున్నారు.



గణాంక ఉద్యోగుల వేతనాన్ని సవరించాలి


శివశంకర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న సంఘం నాయకులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ గణాంక ఉద్యోగులకు నూతన పే స్కేల్‌ను రూపొందించాలని సంఘం అధ్యక్షుడు డి.నాగమల్లేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు కేసీఆర్ అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.శ్రీధర్ రావు కోరారు. సోమవారం నూతనంగా నియమితులైన పే రివిజన్ కమిషన్ చైర్మన్ శివశంకర్‌కు వారు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ గణాంక ఉద్యోగులకు నిరంతరం సకాలంలో శాఖకు సంబంధించిన గణాంకాలు సేకరించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వానికి సకాలంలో పంపించడంలో ముందడుగులో ఉన్నారని తెలిపారు. ఇంత కీలక పాత్ర వహిస్తున్నా ఉద్యోగులు ఈ శాఖలో తరగతి గణాంకలు, ఉపగణాంక అధికారులు, గణాంక సంచాలకుడికి ప్రధాన పాత్ర పోషిస్తున్నారని వివరించారు. సంఘం కార్యదర్శి కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎస్.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు


నూతన కార్యవర్గానికి ప్రొసీడింగ్స్‌ను అందజేస్తున్న కొండూరు గంగాధర్

నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర పశు సంవర్ధక శాఖ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. సోమవారం నాంపల్లిలోని గృహకల్ప భవన సముదాయంలోని కేంద్ర సంఘంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తఖిబాబా, సహాధ్యక్షుడిగా జి.మణిదీప్, ఉపాధ్యక్షులుగా యూ.కార్తీక్, ఎస్.ఇందిరాప్రియదర్శిని, ఎండీ సిరాజ్ ఖాన్, ప్రధాన కార్యదర్శిగా జి.మల్లేష్, సంయుక్త కార్యదర్శులుగా డి.ప్రభుదాస్, ఎస్.నాగరాజు, కె.భాస్కర్, కె.హరికుమార్, ఇ.జగదీష్, ఎస్.రాజేందర్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎండీ అఫ్సర్, ఎండీ సాధిక్, కోశాధికారిగా ఎం.రాముడు, ప్రచార కార్యదర్శిగా వి.రామకృష్ణ, ఆఫీస్ కార్యదర్శిగా జి.వేణును ఎన్నుకున్నారు. వీరికి తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గద్దం జ్ఞానేశ్వర్, కొండూరు గంగాధర్ నియామకపు పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా రవాణా వ్యవస్థను ప్రోత్సహించాలి


డ్రా తీస్తున్న ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ తదితరులు

అఫ్జల్‌గంజ్: సురక్షితమైన ప్రయాణానికి ప్రజలు ప్రజా రవాణా వ్యవస్థను మరింత ప్రోత్సహించాలని ఎల్‌బీ నగర్ ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మహాత్మా గాంధీ బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన దసరా పండుగ డ్రా విజేతలను ప్రకటించారు. దసరా పండుగ సందర్భంగా అక్టోబర్‌లో 18 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికుల టికెట్ల డ్రా కార్యక్రమం ఎంజీబీఎస్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషులను డ్రా తీసి ఎంపిక చేశారు. విజేతలు ఒక్కొక్కరికీ రూ.9900 నగదు బహుమతులను అందజేశారు.

మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా మహేష్



అబిడ్స్: మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎం.మహేష్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని నెలలుగా మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన రవికుమార్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మహేష్‌ను నియమించారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ మహేష్ గతంలో చౌటుప్పల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా, వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా సీసీఎస్, నాచారం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాబోయే శ్రీరామనవమి, హనుమాన్ జయంతి, రంజాన్ పర్వదినాల వేడుకలకు స్థానిక ప్రజల సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తామన్నారు.

కనుల పండువగా చెన్నకేశవ స్వామి కల్యాణం


స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ గురునాథ్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని స్వయంభు లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి కల్యాణ మహోత్సవం సోమవారం నేత్ర పర్వంగా కొనసాగింది. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ మధ్యాహ్నం 12 గంటలకు స్వామి వారి తిరు కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఆనవాయితీలో భాగంగా చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ గురునాథ్ స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బంది బ్యాండ్ మేళాలను వాయించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి 8 గంటలకు స్వామి వారి పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. ఈవో శివ రుద్రప్ప, అర్చకులు ప్రణయ్ చారి, పాలక మండలి చైర్మన్ జుర్కీ సంతోషి రాణి, సభ్యులు ఉమా మహేశ్వరీ, రవి రాహుల్, పి.చంద్రశేఖర్, మీనాక్షి, అర్చనల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు కొనసాగాయి. నిజామాబాద్‌కు చెందిన చిన్నారులు చేసిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కల్యాణ మహోత్సవంలో ఇంటలెజెన్స్ ఏసీపీ రుద్ర భాస్కర్, నాయకులు జుర్కీ రాజేందర్, కె.వెంకటేష్, ప్రమోద్ కార్వంకర్, రాజు ముదిరాజ్, జంగ రాజు తదితరులు పాల్గొన్నారు.

‘హైదరాబాద్ ఎంపీ టికెట్ కేటాయించాలి’

చార్మినార్: కాంగ్రెస్ పార్టీలో మున్నూరు కాపు సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించడానికి తనకు హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి టికెట్ కేటాయించాలని టీపీసీసీ కార్యదర్శి, తెలంగాణ మున్నూరు కాపు సంఘం సభ్యుడు కోట శంకర్ ఆనంద్ రావు కోరారు. తనకు టికెట్ కేటాయించాలని కోరుతూ దరఖాస్తులు చేయడమే కాకుండా పార్టీ అధిష్టానానికి వినతి పత్రాలను సమర్పించినట్లు ఆయన తెలిపారు. పార్టీలో ఇప్పటికే అన్ని సామాజిక వర్గాలకు చెందిన నాయకులకు తగిన ప్రాధాన్యత కల్పించిన పార్టీ అధిష్టానం మున్నూరు కాపు సామాజిక వర్గానికి కూడా సముచిత స్థానం కల్పించాలని ఆయన కోరారు. నియోజకవర్గం పరిధిలో దాదాపు 2 లక్షల వరకు మున్నూరు కాపు ఓటర్లున్నారని..ఈసారి జరిగే పార్లమెంటు ఎన్నికల్లో హైదరాబాద్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనకు టికెట్ కేటాయించాలన్నారు.

బాధ్యతల స్వీకరణ



చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కె.ఆదిరెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన రాఘవేంద్ర బదిలీపై వెళ్లడంతో, ఆయన స్థానంలో బోరబండ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న 2007 బ్యాచ్‌కు చెందిన ఆదిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆది రెడ్డి మాట్లాడుతూ..స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

గోల్కొండ దసరా సమ్మేళన్ చైర్మన్ సర్దార్ సింగ్ మృతి


సర్దార్‌సింగ్ (ఫైల్)

గోల్కొండ: గోల్కొండ దసరా సమ్మేళన్ కమిటీ చైర్మన్ సర్దార్‌సింగ్(78) సోమవారం మృతి చెందారు. గోల్కొండ బంజారీ దర్వాజ సమీపంలో అలిజాపూర్‌లోని తన స్వగృహంలో ఆయన మృతి చెందారు. కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో ఆయన బాధపడుతున్నారు. సమాజ సేవకుడిగా గోల్కొండ, లంగర్‌హౌజ్, కార్వాన్ తదితర ప్రాంతాల వారికి ఆయన సుపరిచితుడు. గోల్కొండలో జరిగే దసరా సమ్మేళన్ విజయవంతం చేయడానికి ఆయన ఎంతగానో కృషి చేసే వారు.

వృద్ధుడి అదృశ్యం



నర్సింహ

గౌలిపురా: భార్యతో గొడవ పడిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..మురాద్‌మహల్‌కు చెందిన పుష్ప, నర్సింహ (68) దంపతులు. విశ్రాంత ఉద్యోగి అయిన నర్సింహకు భార్యకు గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గత నెల 21న కుటుంబసభ్యులు ఉప్పుగూడలో వివాహానికి వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా నర్సింహ కనిపించలేదు. అతని కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో, పుష్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొఘల్‌పురా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

విద్యార్థి కంటికి గాయం.. ఉపాధ్యాయురాలిపై ఫిర్యాదు

డబీర్‌పురా: విద్యార్థి కంటికి గాయం కావడంతో తల్లిదండ్రులు ఉపాధ్యాయురాలిపై డబీర్‌పురా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నల్గొండ చౌరస్తా ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో అబ్దుల్లా అబూబకర్(7) ఒకటో తరగతి చదువుతున్నాడు. పాఠశాలలో తెలుగు బోధిస్తున్న లతా అనే ఉపాధ్యాయురాలు అబూబకర్‌ను చదువు విషయంలో మందలిస్తూ కర్రతో కొట్టడంతో చిన్నారి ఎడమ కంటికి గాయమైంది. తన కుమారుడు గాయపడడంతో కుటుంబ సభ్యులు సోమవారం డబీర్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతున్న యాచకుడి మృతి



గౌలిపురా: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యాచకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ..మొఘల్‌పురా వాటర్ ట్యాంక్ సమీపంలో గత నెల 18న 40 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని యాచకుడిని గుర్తు తెలియని వైట్ కలర్ కారు ఢీకొట్టి పరారయ్యింది. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యాచకుడు ఆదివారం మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



వేడుకల్లో మనోరమ్మ స్వామిగౌడ్, డాక్టర్ కెబి.సంధ్య తదితరులు

అబిడ్స్: టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలు చేశారు. గృహకల్ప కార్యాలయంలో జరిగిన ఈ సంబరాల్లో ముఖ్యఅతిథులుగా మనోరమ్మస్వామిగౌడ్, డాక్టర్ కేబీ సంధ్య, డాక్టర్ సోమవతి, సీమా ముజీబ్, కుమారి బి.రేచల్, ఆర్.రంజన, పీవీజీ రాణి, సుజాత, గీతా పాల్గొని కేకును కట్‌చేసి సంబరాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎం ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..మహిళా శక్తి అభివృద్ధికి, మహిళా సంక్షేమానికి తమ టీఎన్జీఓస్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందన్నారు.

‘ఉత్సవాలు శాంతి సామరస్యాన్ని పెంపొందిస్తాయి’


అతిథులకు బొకే అందజేసి సన్మానిస్తున్న దీపాంకర్ పాల్

చార్మినార్: పాతబస్తీలో ఉత్సవాలు ఇరువర్గాల్లో శాంతి సామరస్యాన్ని పెంపొందిస్తాయని చార్మినార్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. హరేకృష్ణ నామ్ సంకీర్తన కమిటీ ఆధ్వర్యంలో కులీకుతుబ్ షా స్టేడియంలో రెండు రోజుల పాటు జరిగిన సంకీర్తన కార్యక్రమాలు ఆదివారం రాత్రితో ముగిశాయి. కాంగ్రెస్ పార్టీ చార్మినార్ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జి వెంకటేష్‌తో పాటు ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ తదితరులు ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వీరిని బెంగాలీ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దీపాంకర్ పాల్ ఆహ్వానించి బొకే అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బెంగాలీ మహిళా విభాగం అధ్యక్షురాలు మందిరసస్కార్, మల్లిక్, కార్తీక్, వికాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఫుట్‌బాల్ మాజీ క్రీడాకారుడు మహ్మద్ మజీద్‌తో కోచ్ తదితరులు

మహ్మద్ మజీద్‌కు సన్మానం

గోల్కొండ: క్రీడల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం ప్రతి క్రీడాకారుడికి గర్వకారణమని మాజీ ఫుట్‌బాల్ క్రీడాకారుడు మహ్మద్ మజీద్ అన్నారు. ఇటీవలే రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో పని చేస్తూ పదవీ విరమణ పొందిన ఆయనను సోమవారం గోల్కొండ రిసాల బజార్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో స్థానిక క్రీడాకారులు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ..గోల్కొండ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో తాను ఫుట్‌బాల్ ఆడడం మొదలుపెట్టానని ఈ గ్రౌండ్‌లోనే ఓనమాలు నేర్చుకొని అప్పటి ఉమ్మడి రాష్ట్రానికి మూడు దశాబ్దాల పాటు క్రీడాకారుడిగా, కోచ్‌గా పని చేశానని అన్నారు. రాష్ట్ర ఫుట్‌బాల్ కోచ్ సఫ్దర్‌పాషా, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్, గోల్కొండ ఓల్డ్ బాయ్స్ ఫుట్‌బాల్ అసోసియేషన్‌కు చెందిన పలువురు పాల్గొన్నారు.

మాధవీలతకు శుభాకాంక్షలు


మాధవీలతకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న శ్రీకాంత్ తదితరులు

చార్మినార్: పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి మాధవీలత విజయం ఖాయమని బీజేపీ నాయకుడు కే. శ్రీకాంత్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు ఈసారి జరిగే పార్లమెంటు ఎన్నికలకు చాలా తేడా ఉందన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న మాధవీలత తప్పక విజయం సాధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్‌యాదవ్, భాతీ తదితరులు పాల్గొన్నారు.

‘విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు’


ట్రోఫీలతో విద్యార్థులు

గోల్కొండ: విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు అద్భుతాలు సృష్టిస్తారని గోల్కొండ ప్రభుత్వ ఉన్నత తెలుగు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.ఎస్.అనురాధాదేవి అన్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇటీవలే నగర స్థాయిలో జరిగిన సైన్స్ క్విజ్ అండ్ ఎగ్జిబిషన్ పోటీల్లో విజేతలుగా నిలిచి ట్రోఫీలు, మెమొంటోలు పొందారు. సోమవారం గోల్కొండలోని పాఠశాలలో వారిని పాఠశాల తరఫున అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఉపాధ్యాయుల కృషి, ప్రోత్సాహం వల్ల తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతి యేటా పదవ తరగతిలో ఉత్తమ ర్యాంకులు పొందుతున్నారన్నారు. పాఠశాలకు చెందిన జగదీష్, సంజయ్, వైశాలి, హర్షద్ ట్రోఫీలు సాధించారని అదే విధంగా సిద్ధార్, నక్షత్ర, ఆదిల్, నిజాం మెమొంటోలు సాధించారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎస్.సుబ్బారావు, కవిత, ఎస్.సంధ్యారాణి తదితరులున్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం


మధుయాష్కీగౌడ్‌తో కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలోని అన్ని స్థానాలు గెలిచి కాంగ్రెస్ పార్టీ సత్తాచాటడం ఖాయమని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. రాష్ట్ర ఎరుకల సంఘం ప్రతినిధులు సోమవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎరుకల సంఘం నాయకులు ఆయనకు ఎరుకల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమ కులస్తులు అన్ని రకాలుగా నష్టపోయారని ఎరుకల సంఘం రాష్ట్ర నాయకుడు కురాకుల కృష్ణ ఆయనకు వివరించారు. మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ.. ఎరుకలు ఐక్యంగా ఉంటే వారు తమ హక్కులను సాధించుకోగలుగుతారన్నారు. సత్యనారాయణ, యాదగిరి, రఘు, శ్రీను, బి.కృష్ణ, కె.రవి, ఆర్.నర్సింహ, పాపయ్య తదితరులున్నారు.

పాతబస్తీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి


మంత్రికి వినతి పత్రం ఇస్తున్న రాజేశ్‌కుమార్, మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ తదితరులు

చార్మినార్: పాతబస్తీ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను పాతబస్తీ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి కోరారు. చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్, బహదూర్‌పురా ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్‌కుమార్ తదితరులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బహదూర్‌పురా శాసనసభ నియోజకవర్గంలోని 6 డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించడానికి రూ.5 కోట్ల ప్రత్యేక నిధులను మంజూరు చేయించాలని పులిపాటి రాజేశ్‌కుమార్ మంత్రిని కోరినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో బోయ నగేష్ తదితరులున్నారు.

‘పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే విజయం’


రాజేష్ యాదవ్

అబిడ్స్: పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ విజయ దుందుభి మోగిస్తుందని గ్రేటర్ హైదరాబాద్ బీజేవైఎం సీనియర్ నాయకుడు, నగర శ్రీకృష్ణ భారతీయ యాదవ సేవా సమితి అధ్యక్షుడు బి.రాజేష్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ..ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన ప్రగతి, అభివృద్ధి, సంక్షేమ పథకాలతోనే బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. పాతబస్తీలో మైనార్టీల ఓట్లను దండుకుంటూ పాతబస్తీ అభివృద్ధిని విస్మరించిన ఒవైసీకి ఓటమి తప్పదన్నారు. కొన్ని సంవత్సరాలుగా పాతబస్తీలో మాధవీలత చేపట్టిన అభివృద్ధి పథకాలు, సమాజ సేవలు, హిందుత్వ కార్యక్రమాలు, మోదీ పథకాలతో ఆమెను భారీ మెజార్టీతో ప్రతి కార్యకర్త గెలిపించేందుకు కృషి చేయాలన్నారు.

ఉచితంగా మంచినీటి సౌకర్యం ఏర్పాటు


చల్లటి మంచినీటిని అందజేస్తున్న పంకజ్‌కుమార్ అగర్వాల్

చార్మినార్: దాహార్తులకు అందుబాటులో మంచి నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కుంభ మేళా అగర్వాల్ బంధు, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. రికాబ్‌గంజ్‌లోని తన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత మంచినీటి సౌకర్యాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలన్నారు. రద్దీ గల ప్రాంతాల్లో ఉచితంగా మంచి నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

‘గోషామహల్‌కు కొత్త ఇన్‌చార్జిని నియమించాలి’


ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి కొంత మంది నాయకులు ద్రోహం చేసినందుకే పార్టీ ఓడిపోయిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో ఆనంద్‌కుమార్‌గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ..ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో కార్యకర్తలను పట్టించుకునే నాయకుడే లేడన్నారు. ఈ విషయాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించినా ఆయన పీఏ తిరుపతి కేటీఆర్‌ను కలువనివ్వడం లేదన్నారు. కేటీఆర్ చుట్టూ తిరుగుతూ పార్టీకి వారే మోసం చేశారన్నారు. కేటీఆర్ దృష్టి సారించి గోషామహల్ నియోజకవర్గంలో ఒక సమావేశం నిర్వహించాలన్నారు. కార్యకర్తలు, నాయకుల అభిప్రాయాలను తీసుకుని గోషామహల్ నియోజకవర్గానికి కొత్త ఇన్‌చార్జిని నియమించాలని ఆనంద్‌కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

అర్చకుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

సుల్తాన్‌బజార్: ప్రభుత్వం అర్చకులకు గ్రాంటిన్ ఏయిడ్ ద్వారా వేతనాలు చెల్లిస్తూనే వారి సంక్షేమం కోసం పాటుపడుతుందని వెల్ఫేర్ బోర్డు చైర్మన్ నవీన్‌మిట్టల్ అన్నారు. సోమవారం బొగ్గులకుంటలోని దేవాదాయ, ధర్మాదాయ కమిషనరేట్‌లో వెల్ఫేర్ బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చక ఉద్యోగుల సంక్షేమం కోసం పలు తీర్మానాలు ప్రవేశపెట్టారు. ఆయన మాట్లాడుతూ..అర్చక ఉద్యోగులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా హెల్త్ ఇన్సూరెన్స్‌ను అందజేయనున్నట్లు తెలిపారు. రూ.50 వేల లోపు వేతనాలు ఉన్నవారికి ఇది వర్తింపచేస్తామన్నారు. రిటైర్డ్ హైకోర్టు జడ్జి వామన్‌రావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, సభ్యులు చిలకమర్రి శ్రవణకుమారాచార్యులు, నారాయణ స్వామి, కందూరి కృష్ణమాచారి పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



గోల్కొండ: వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ చలివేంద్రాలను ఏర్పాటు చేస్తూ సేవాభావాన్ని ప్రదర్శిస్తుంది. మెహిదీపట్నం, తాళ్లగడ్డ, ఆసిఫ్‌నగర్, సీతారామ్‌బాగ్, టోలీచౌకి, షేక్‌పేట్‌తో పాటు రాజేంద్రనగర్ పరిధిలోని సన్‌సిటీ, బండ్లగూడ ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు ప్రారంభించింది. కొన్ని ప్రాంతాల్లో ఏఎంఆర్ ఎంటర్ ప్రైజెస్ ద్వారా చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఆర్ఓ నీటిని శాస్త్రీయ పద్ధతిలో స్టాండ్లపై మట్టికుండలను పెట్టి నీటి సరఫరా చేస్తున్నామని నిర్వాహకులు కృష్ణమోహన్‌కుమార్ తెలిపారు. వాటర్ ప్యూరిఫైర్‌లపై సలహాల కోసం 80900 20077, 80900 80077 లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం



సుల్తాన్‌బజార్: సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో సోమవారం ఆసుపత్రి ఆవరణలో రూ.37 లక్షలతో వేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఎంతోమంది ప్రసవాల కోసం వివిధ జిల్లాల నుంచి రాష్ట్రాల నుంచి వస్తుంటారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తమ ఫండ్ నుంచి రూ.37 లక్షల సీసీ రోడ్లు వేయించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి, గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ రాకేష్ పాల్గొన్నారు.